# నిరాహార దీక్ష

సరస్వతీదేవి తీరిగ్గా కూర్చుని వీణ వాయించుకుంటోంది. మహా విష్ణువుకు ప్రేమతో మరియు భక్తితో కాళ్ళు పిసుకుతున్న లక్ష్మీదేవి కోడల్ని చూసేసరికి కొంచెం చిరాకు వేసింది.

"వీణ వాయించుకుంటూ కూర్చునే బదులు ఇంట్లో పని చూడకూడదా?" అంది అత్తగారైన లక్ష్మీదేవి. ఆమె మాటలు వినబడనట్టు కోడలు సరస్వతీదేవి వీణ ఇంకా గట్టిగా వాయించసాగింది.

"నువ్వెంత చదువుల సరస్వతివైనా అత్తని అంత నిర్లక్ష్యం చెయ్యకు. వీణ కట్టిపెట్టు" అని లక్ష్మీదేవి యింకా గట్టిగా అరిచింది.

కోడలు వీణ ఆపి అత్తగారిని తీక్షణంగా చూసింది.

"సిరి, సంపద వుంటే చాలదు. చదువు, సంస్కారంకూడా వుండాలి. ఎంత అత్తగారైతే మాత్రం ఏమిటి మీ పెత్తనం?" అంది వుక్రోషంతో సరస్వతి.

"అత్తని కాబట్టి నాకా అధికారంవుంది. నా సిరిసంపద గురించి నువ్వు వ్యాఖ్యానించ నక్కర్లేదు. నీ చదువు, సంస్కారం నీ దగ్గరే వుంచుకో." అంది లక్ష్మీదేవి కోపంగా.

"చదువు, సంస్కారం అనేవి అందరికీ కావాలన్నా రావు. అదృష్టం వుంటే సిరి, సంపదా ఎవరికైనా లభిస్తాయి" అంది. ఎత్తిపొడిచింది కోడలు.

"సిరీ, సంపదా లేని చదువు సంస్కారం వుండి మాత్రం ఏం లాభం?" అని మాటామాటా పెంచింది అత్తగారు.

"రూపాయి లాటరీ టిక్కెట్టు కొంటే చాలు ఎవడికైనా లక్షలు రావచ్చు. ఎంతో కష్టపడితే తప్ప చదువు అందరికీ అంత సులభంగా రాదు" అంది కోడలు.

"డబ్బుతో ప్రపంచంలో సాధించలేనిది లేదు. నా కటాక్షం వుంటే ఎవరైనాసరే ఏదైనా సాధించవచ్చు" అంది లక్ష్మీదేవి గర్వంగా.

"భక్తుల్ని మీరు కటాక్షించినంత సులభంగా నేను కటాక్షించను. అర్హతైన వాళ్ళకి సరస్వతి ప్రసన్నం కాదు" అంది సరస్వతి.

"అంటే నేను అర్హతైన వాళ్ళకి, అర్హత లేనివాళ్ళకి సహాయపడతాననేగా?" అని ప్రశ్నించింది అత్తగారు.

"అవును. అవినీతిపరులంతా సంపన్నులై వర్ధిల్లుతున్నారు మరి దాని అర్థం



అంతేకదా?" అంది కోడలు.

"అడ్డమైన వాళ్ళు డిగ్రీలు సంపాదించడంలేదా? డొనేషన్ కట్టి కాలేజీల్లో సీట్లు కొనుక్కోవడంలేదా? విశ్వవిద్యాలయాల వాళ్ళు అర్హతలేని వాళ్ళకి కూడా 'కళా ప్రపూర్ణ'లు ఇవ్వడంలేదా?" అని అడిగింది అత్తగారు.

"డబ్బుకి గడ్డితినే వాళ్ళు కొందరు వున్నంత మాత్రాన అందరూ అలాగే అనుకోకండి" అంది సరస్వతీ దేవి కోపంగా.

"డబ్బుకోసం అందరూ గడ్డి తింటారు కాబట్టే నీ చదువు కంటే నా డబ్బు గొప్పది అని చెపుతున్నాను. ఇంక అనవసరంగా నాతో వాదించకుండా వెళ్ళి వీణే వాయించుకో" అంది లక్ష్మీదేవి విసుగ్గా.

"అత్తగారూ, మీరెంత గొప్పవారైనా ఒక్కటి మాత్రం గుర్తుంచుకోండి. మీ డబ్బు కంటే ఎప్పటికీ నా చదువే విలువైనది. విద్యా దానాన్ని మించిన దానం ప్రపంచంలో మరేదీలేదు. వరదలొచ్చినా వర్షాలొచ్చినా, కరువులొచ్చినా, కాటకాలొచ్చినా, దొంగలు పడినా, దోపిడీలు జరిగినా విద్యని ఎవ్వరూ దొంగిలించలేరు. డబ్బు ఇచ్చే యజమానికంటే విద్యనిచ్చే గురువు గొప్పవాడు." అని సరస్వతి కయ్యానికి దిగింది.

"నీతో నాకు వాదన ఎందుకు. కావాలంటే పందెంకాయి. విద్య చెప్పే గురువు గొప్పవాడో జీతం ఇచ్చే యజమాని గొప్పవాడో నేను నిరూపిస్తాను" అంది అత్తగారు.

"సరే, పందెంకి నేను సిద్ధం. గురువు గొప్పతనం నేను నిరూపిస్తాను." అని కోడలు సవాలు చేసింది.

ఇంతలో అక్కడికి వచ్చిన నారదుడు ఇదంతా విని "నారాయణ, నారాయణ" అంటూ లోపలికి ప్రవేశించాడు.

"మీరే చెప్పండి మహర్షీ, చదువు చెప్పే గురువుకంటే, జీతంఇచ్చే యజమాని గొప్పవాడా?" అనడిగింది సరస్వతి.

"ఎలాగవుతాడు?" అన్నాడు నారదుడు.

"చదువు చెప్పే మాస్టర్‌కంటే జీతం యిచ్చే కమిటీ మెంబరు గొప్పవాడుకాడా?" అనడిగింది లక్ష్మీదేవి.

"ఎందుకు కాడు?" అన్నాడు నారదుడు.

అత్తాకోడళ్ళు ఇద్దరికీ కోపం వచ్చి నారదుడ్ని తీక్షణంగా చూశారు.

"మీరు అలా కోపంగా చూడకండి. మీరిద్దరూ గొప్పవారే. విద్య, ధనం రెండూ గొప్పవే." అని ఇద్దరికీ నమస్కరించాడు నారదుడు.


"ఇద్దరిలో ఎవరు గొప్ప?" అని అత్తాకోడళ్ళిద్దరూ ముక్తకంఠంతో అడిగారు.

"ఈ విషయం తేల్చుకోవాలంటే ఆంధ్ర దేశంలో బడిపంతుళ్ళని పరీక్షకి పెట్టాలి" అని చెప్పి నారదుడు చల్లగా జారుకున్నాడు.

పర్యవసానంగా బడిపంతుళ్ళ బతుకు దుర్భరమైపోయింది. "బతకలేక, బడిపంతులు" అనే సామెత కూడా తయారయ్యింది

(64వ పేజీ చూడండి)

## స్వాగతంబు



సాహిత్య, సంగీతాల్లో, తలస్పర్శి అయిన కృషి చేసినవారు, సహృదయులైయుండీ, సాహిత్య విమర్శలో నిశితదృష్టి చెడనివారు. "రాళ్ళపల్లికి సరిజోడు రాళ్ళపల్లి" అనిపించుకున్న రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు మార్చి 11వ తేదీన 87 సంవత్సరాల వయస్సులో బెంగుళూరులో కాలధర్మం చెందారు.

## గ్రంథావని

# మళయాళ వాఙ్మయ చరిత్రము

[తెలుగు అనువాదం : డాక్టర్ దివాకర్ల వెంకటావధాని: ప్రచురణ : సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ: మూల్యం : రు. 12/-]

భారత దేశంలోని వివిధ భాషల సాహిత్య చరిత్రలను ప్రచురించాలనే సంకల్పంతో కేంద్ర సాహిత్య అకాడెమీ ప్రచురిస్తున్న ప్రముఖ భాషల సంక్షిప్త చరిత్ర పరంపరలో ఈ మళయాళ వాఙ్మయ చరిత్రము ఒకటి. సుప్రసిద్ధ మళయాళ భాషా విద్వాంసులు శ్రీ పి. కె. పరమేశ్వరన్ నాయర్ మళయాళంలో, విషయం విస్తృతమైనదైననూ, సమగ్రంగానూ, సంక్షిప్తంగాను రచించారు.

సంస్కృతాంధ్రాంగ్లేయభాషలలోపండితుడై భాషాకోవిదుడుగాకవిగావన్నెకెక్కినడాక్టరు దివాకర్ల వెంకటావధానిగారు సామాన్య చదువరులకు పఠన యోగ్యంగా తెలుగులోనికి అనువదించారు. అవధానిగారు తమ సహజ రచనా శైలిలో అనువాదాన్ని సాగిస్తూ, అందు ఉదహరింపబడ్డ కవితా ఖండములను చక్కని గేయములలోనూ, గీతములలోనూ, పద్యములలోనూ హృద్యంగా అనువదించారు. ఇందుకు తమ కవి హృదయమునకు సంస్కృత భాషా పాండిత్యము తోడుపడి వారి కృషిని సులభతరం చేసినది.

భాష ఉత్పత్తి కథనము మొదలు, ఆదిమ భాష, చెందమిళము, మణిప్రవాళము, భక్తి నీతి కవనము, ఆదిమ వచన వాఙ్మయము, కథకళీ సాహిత్యము, ప్రజా కవిత్వము, నేటి ఆధునిక ప్రక్రియల వరకూగల భాషాపరిణామం చక్కగా వివరింపబడినవి. ఆంగ్లేయ భాషా సంపర్కమువలన ఖండ కావ్యములు, భావ గీతములు, నాటక, నవల, కథానిక, వ్యాసముల ప్రాదుర్భావంతోపాటు కవిత్వ పునరుజ్జీవనమూ కాల్పనికోద్యమమూ, గద్య సాహిత్యమూ మున్నగు విషయములన్నియు దేశకాల సాంఘిక పరిస్థితులనూ వర్తమాన సన్నివేశములనూ అనుసరించి విశదీకరింపబడినవి.

కథకళీ సాహిత్యమూ, దాని పరిణామమూ, తుళ్ళన్ అనే ఇంకొక నాట్యరీతికి అనుగుణమైన ప్రజాసాహిత్యమూ, దాని విశిష్టతా చక్కగా విశదీకరించబడింది. స్తోత్రములు మొదలైన ఆదిమ మళయాళ రచనల అనంతరం చేరరాజుల ప్రాబల్యమున వృద్ధి చెందిన చెందమిళ్ వాఙ్మయమూ పిమ్మట నంబూద్రీ బ్రాహ్మణుల సంపర్కంవల్ల సంస్కృత భాషా ప్రభావము గణనీయంగా పొందిన మణిప్రవాళ సారస్వతమూ, పొట్టు రచనలూ మున్నగునవి మళయాళమునకు ఎంతటి సారస్వత గౌరవమును ఆపాదించినవో చక్కగా వివరింపబడినది

అయితే ఉదాహరణలుగా ఇచ్చిన తెలుగు పద్యగీతములతోపాటు వాటికి మూలములైన మళయాళ గీతములు కూడా ఇచ్చియుండినచో వాని భావగాంభీర్యమును చిత్రణా చమత్కారమును పాఠకులు ఇంకను ఎక్కువగా గ్రహించుటకు వీలు కలిగిఉండెడిది.

ముఖ్యమైన సందర్భములలో మళయాళమునకును, తెలుగునకును గల సామ్య సదృశ్యము - కొద్దిగా ఫుట్ నోట్సులోనైనా సూచించియుండినచో అకాడెమీ తలపెట్టిన భావ సమైక్యత ఆత్మగతం చేసుకొనే అవకాశ మేర్పడి ఉండెడిది.

వ్రాయించి ప్రకటించినది కేంద్ర సాహిత్య అకాడెమీ, రచించినవారు మళయాళ విద్వాంసులు తెలుగు చేసినవారు మూడు భాషలలో సిద్ధహస్తులు.. అకాడెమివారి ఆశయము నెరవేరినదనుటలో సందేహములేదు. "అక్షరాస్యుడైన ప్రతి భారతీయుడూ తన మాతృభాషకాక ఇతర భాషలగురించి కూడా కొంచెమైనా తెలుసుకోవడం వాంఛనీయం" అని జవహర్‌లాల్ నెహ్రూ అన్నారు ఇది భాషాభిమానులందరూ పఠించదగినదై యున్నది.

— కు. వేం.

## స్వీకారం

### జంతు హింసా నివారణ సంఘం, కాకినాడ

ఈ సంఘం 1977-78 సంవత్సరపు వార్షిక నివేదికను వెలువరించింది.

### శ్రీ విష్ణు సహస్రనామం

పేజీలు : 196; వెల రు. 3-50; ప్రతులకు : ప్రాగ్ భారతీ పబ్లికేషన్స్, 14, సుంకురామ చెట్టి వీధి, మద్రాసు-600 001.

విష్ణుసహస్ర నామం స్తోత్రం, నామావళి వివరణ ఇందులో వున్నాయి. అంపశయ్యపై చేరిన భీష్ముడు ధర్మరాజుకు అనుగ్రహించిన నామ సందేశానికి వివరణ శ్రీ ఇలపావులూరి పాండురంగారావుగారిది.

## స్వగతంబు

(4వ పేజీ తరువాయి)

విద్యాదానంచేసే బడి పంతుళ్ళకంటే వాళ్ళకి జీతాలు ఇచ్చే కమిటీ మెంబర్లు, వాళ్ళకి గ్రాంటులు ఇచ్చే ప్రభుత్వం ఎవరికి వారే గొప్పవాళ్ళమని భావించసాగారు.

జీతాలు అప్పుడప్పుడైనా ఇవ్వకపోతే బడిపంతుళ్ళు బతకరు కాబట్టి ఎప్పుడో ఒక్కసారి జీతాలుఇస్తూ వాళ్ళకంటే తామే గొప్పవాళ్ళమని కమిటీలవాళ్ళు ప్రభుత్వం నిరూపించుకుంటూ రాసాగారు.

అయినా సరస్వతీదేవిని గెలిపించడం కోసం బడి పంతుళ్లు అలాగే జీతాలు రాకపోయినా పాఠాలు చెప్తూ వచ్చారు.

ఎనభైనెలలు జీతాలురాని మాష్టర్లు, ఇరవైనెలలు జీతాలు రాని మాష్టర్లు కలిసి 'శతమాస దినోత్సవాలు' జరుపుకున్నారు. అయినా లక్ష్మిదేవి గుండె కరగలేదు. కాబట్టి కమిటీ మెంబర్లు, ప్రభుత్వం వారి గుండెకూడా కరగలేదు. నారదుడి సలహాపై బడిపంతుళ్ళు వేరే గత్యంతరంలేక నిరాహార దీక్ష ప్రారంభించారు.

జీతాలు జీవితంలో బతికుండగానే యిమ్మని వేడుకున్నారు.

"చూశావా కోడలా ! నిన్ను నమ్ముకున్న వాళ్ళు నా దయకోసం ఎలా ప్రాధేయపడుతున్నారో" అంది లక్ష్మీదేవి.

"నిరాహార దీక్ష మొదలెటినంత మాత్రాన వాళ్ళు ఓడిపోయినట్టుకాదు" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది కోడలు.

"లక్ష్మి! మీ పంతాల కోసం బడి పంతుళ్ళని యిలా యిక్కట్లు పెట్టడం భావ్యం కాదు వాళ్ళు నిరాహారదీక్ష కొత్తగా మొదలెట్టలేదు. ఎప్పట్నించో తినడనికిలేక నిత్యం నిరాహారదీక్ష చేస్తున్నారు. వాళ్ళే కాదు, వాళ్ళ పెళ్ళాం బిడ్డలు కూడా నిరాహారదీక్ష చేస్తున్నారు. కాబట్టి మీ పట్టింపులు వదిలి వాళ్ళని సుఖంగా బతకనివ్వండి"అని పరమేష్ఠి హితవు చెప్పాడు.

కానీ అత్తాకోడళ్ళు పంతాలు వదలలేదు. బడిపంతుళ్ళ బతుకు బాగుపడలేదు.

[నీతి :-మంత్రులు తమ గౌరవార్థం జరిగే విందు ఆరగించబోయేముందు బడి పంతుళ్ళ, వాళ్ళ పెళ్ళాం, బిడ్డల్ని ఒక్కసారి తల్చుకోవాలి.]

— బు

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada-10.
Editor : Puranam Subrahmanya Sarma.